ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024



పాయకరావుపేటలో ప్రజాగళం సభకు హాజరైన అశేష ప్రజానీకం

బాబుకు బ్రహ్మరథం

పాయకరావుపేట ప్రజాగళం సభకు పోటెత్తిన జనం



కమలం, సైకిల్ గుర్తులను చూపుతున్న చంద్రబాబు, చిత్రంలో పాయకరావుపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని అనిత, అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఉన్నారు

- టీడీపీ అధినేతపై దారిపొడవునా పూల వర్షం
- ప్రసంగానికి విశేష స్పందన
- తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీల పరిరక్షణకు కృషి చేస్తానని చంద్రబాబు హామీ

... మరిన్ని ఫొటోలు, వార్తలు 7వ పేజీలో

- సభ విజయవంతం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం

పాయకరావు పేట/రూరల్, ఏప్రిల్ 14: పాయకరావుపేటలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం నుంచి నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల నుంచి భారీగా జనం కదలి వచ్చారు. పాయకరావుపేటలో ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

పాయకరావుపేటను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా..

పాయకరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి రోజున పాయకరావుపేట నియోజకవర్గానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాయకరావుపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించే బాధ్యత తీసుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పాయకరావుపేట సూర్యామహల్ జంక్షన్‌లో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడారు. ముందుగా బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అశేషంగా హాజరైన ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఒక ఎమ్మెల్యే ఉండేవాడని, ఆయన ఈ ప్రాంతాన్ని ఊడ్చేశాడని ఆరోపించారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నాడో తెలియదన్నారు. ఇక్కడ ఏమీ మిగలకుండా చేశాడని, ఇప్పుడు కొత్తగా ఒక ఎమ్మెల్యే ఇక్కడికి అభ్యర్థిగా వచ్చాడని, ఆయన ఎక్కడ నుంచి ప్యారాచూట్ వేసుకొని వచ్చాడో తెలియదని ఎద్దేవా చేశారు. అక్కడ ఆ ఎమ్మెల్యే చెత్త అయితే ఇక్కడకు వస్తే బంగారం అవుతాడా? అని పరోక్షంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏపీఐఐసీలో 8 వేల ఎకరాలు భూసేకరణ జరిపామన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఈ ప్రాంతాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తయారు చేసే అవకాశం ఉందన్నారని, ఆ దిశగా చర్యలు చేపట్టే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను ఎన్నుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.



చంద్రబాబుకు మగ్గం బహూకరిస్తున్న చేనేత కార్మికులు

ఆధ్యాత్మిక కేంద్రంగా ఉపమాక

- పాయకరావుపేట సభలో చంద్రబాబు హామీ

నక్కపల్లి: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం పాయకరావుపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఉపమాకలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. తన హయాంలోనే విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు సేకరించామని, వైసీపీ ప్రభుత్వం ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడున్న వారికే ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పిస్తానని చెప్పారు. మత్స్యకారులకు సంబంధించి జెట్టీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తానన్నారు. నియోజకవర్గంలో వున్న తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను పరిరక్షించుకోవడం కోసం ఎటువంటి చర్యలు చేపట్టాలో ఆలోచిస్తామని చంద్రబాబు చెప్పారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు

కలెక్టర్ విజయసునీత

- ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి

పాడేరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కలెక్టర్ ఎం.విజయసునీత అన్నారు. అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో వున్న విగ్రహానికి కలెక్టర్ ఎం.విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, సాంఘిక సంక్షేమాధికారి జనార్దన్, స్థానిక తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




పాడేరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ఠ

మండుతున్న ఎండలు

కొయ్యూరులో అత్యధికంగా 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

పాడేరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండల తీవ్రత కొనసాగుతున్నది. కొయ్యూరులో ఆదివారం 39.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తరువాత నుంచి ఎండ తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అనంతగిరిలో 33.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 36.0, చింతపల్లిలో 35.2, డుంబ్రిగుడలో 36.2, జీకేవీధిలో 34.9, జి.మాడుగులలో 36.8, హుకుంపేటలో 34.2, ముంచంగిపుట్టులో 35.7, పాడేరులో 36.5, పెదబయలులో 34.1 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి.



నిర్మానుష్యంగా ఉన్న పాడేరు- అరకులోయ ప్రధాన రహదారి

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు

- మరికొందరికి కీలక బాధ్యతలు



బత్తుల తాతయ్యబాబు



దాడి వీరభద్రరావు



బుద్ద నాగ జగదీశ్వరరావు

అనకాపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు నియమితులయ్యారు. ఆయన టీడీపీ చోడవరం నియోజవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. 2006 నుంచి 2011 వరకు ఆయన బుచ్చెయ్యపేట ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. 2020లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, ఇదే సంవత్సరంలో చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు. జిల్లాలో ఆయనతోపాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులకు కీలక బాధ్యతలను అప్పగిస్తూ ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావును ఎన్నికల సంఘం, పత్రికా సమావేశాల (కేంద్ర కార్యాలయం) సమన్వయకర్తగా నియమించారు. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బుద్ద నాగజగదీశ్వరరావును, మరో సీనియర్ నేత దాడి రత్నాకర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించారు. నర్సీపట్నానికి చెందిన సీనియర్ నేత బోలెం ముత్యాల పాపను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.



దాడి రత్నాకర్

ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ ఎప్పటికి పూర్తయ్యేనో ?

గూడెంకొత్తవీధిలో 70 శాతం నిర్మాణాలు పూర్తి

- కాంట్రాక్టరు రూ.40 లక్షలు ఖర్చు చేసినా ఒక్క బిల్లు కూడా మంజూరుకాని వైనం
- ఏడాదిగా నిలిచిన పనులు
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మండిపడుతున్న ఆదివాసీలు

గూడెంకొత్తవీధి/చింతపల్లి, ఏప్రిల్ 14: గూడెంకొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఏడాది కాలంగా ఈ యూనిట్ భవన నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తున్నది. ఆదివాసీ రైతులు నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి చేయూతనందించేందుకు ఐటీడీఏ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈ యూనిట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పల్పింగ్ యూనిట్ కోసం కొనుగోలు చేసిన యంత్రాలు సైతం తుప్పుపడుతున్నాయి. నిధుల కోసం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పలు మార్లు ప్రభుత్వానికి లేఖలు రాసినా స్పందన లేకుండాపోయింది. దీంతో గిరిజన రైతులు నిరాశ చెందుతున్నారు.

ఆదివాసీ రైతులు పండించిన కాఫీ పండ్ల నుంచి నాణ్యమైన పార్చ్‌మెంట్ ఉత్పత్తి చేసేందుకు చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్ తరహాలో రూ.1.3 కోట్ల ట్రైకార్ నిధులతో గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోనూ నిర్మించేందుకు ఐటీడీఏ



అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్ భవనం



జీకేవీధి మండల కేంద్రంలో విరగ్గాసిన కాఫీ పండ్లు(ఫైల్)

2022 సెప్టెంబరులో పనులు ప్రారంభించింది. 2023 జనవరి నాటికి పనులు పూర్తి చేయాలని ఐటీడీఏ లక్ష్యాలను నిర్దేశించింది. అదే ఏడాది కాఫీ సీజన్ నాటికే ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకు వస్తామని ఐటీడీఏ అధికారులు ప్రకటించారు. అయితే నిర్మాణాలకు సంబంధించిన నిధులను వైసీపీ ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పనులు పూర్తి కాలేదు. 2023-24 కాఫీ సీజన్ ప్రారంభంలో ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి తీసుకొస్తామని ఐటీడీఏ అధికారులు ప్రకటించారు. యూనిట్ నిర్మాణాలకు అవసరమైన నిధుల కోసం ఐటీడీఏ అధికారులు పలు మార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపించినప్పటికీ కనీస స్పందన కరువైంది. కాఫీ సీజన్ ముగిసిపోయినప్పటికీ ఎకో పల్పింగ్ యూనిట్ నిర్మాణాలు ఒక్క అడుగు ముందుకు సాగలేదు.

బిల్లులు రాక నిలిచిన పనులు

ఎకో పల్పింగ్ యూనిట్ నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టరు రూ.40 లక్షలు పెట్టుబడి పెట్టి 70 శాతం నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా విడుదల కాకపోవడం వల్ల కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. బిల్లులు మంజూరు చేస్తే పనులు కొనసాగించే అవకాశముంటుందని గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు పలు మార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపించినప్పటికీ కనీస స్పందన రాలేదు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సైతం ఎకో పల్పింగ్ యూనిట్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ నిధులు లేకపోవడం వల్ల పనులు పూర్తి చేయాలని ... మిగతా 8వ పేజీలో

స్టేట్ లెవెల్ అసెస్‌మెంట్ సర్వే పరీక్ష రేపు

- డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, ఏప్రిల్ 14: అల్లూరి జిల్లాలో ఎంపిక చేసిన 147 పాఠశాలల్లో స్లాస్(స్టేట్ లెవెల్ అసెస్‌మెంట్ సర్వే)పరీక్షను ఈ నెల 16న నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ(డీసీఈబీ) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏపీఆర్ బాలికల పాఠశాలలో స్లాస్ పరీక్షకు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా నియమితులైన 147 మందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పరీక్షకు ముందు, పరీక్ష సమయంలో, పరీక్ష నిర్వహణ అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ సర్వే పరీక్ష విద్యార్థుల అభ్యాసన స్థాయిపై సమగ్ర సమీక్షకు తోడ్పడుతుందన్నారు. డీసీఈబీ కార్యదర్శి కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ పరీక్ష జరిగే రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ కో-ఆర్డినేటర్ ఆర్.కామరాజు, ఏఎస్‌వో జి.సింహాచలం, అన్ని మండలాల సీఆర్పీలు, సీఎంవో కె.భాస్కరరావు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.



పాయకరావుపేట సభకు హాజరైన ప్రజానీకానికి అభివాదం చెబుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు



పాయకరావుపేట ప్రజాగళం సభలో మాట్లాడుతున్న సీఎం రమేశ్




పాయకరావుపేట సభకు హాజరైన అశేష ప్రజానీకం

ప్రజాగళం.. జన సంద్రం

పాయకరావుపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభ జన సంద్రంలా మారింది. వృద్ధులు, యువకులు, మహిళల రాకతో పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్ కిటకిటలాడింది. హెలిప్యాడ్ నుంచి సభ జరిగే జంక్షన్ వరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై దారిపొడవునా పూలవర్షం కురిపించారు. చంద్రబాబుకు తమలపాకులతో తయారు చేసిన గజమాలతో రైతులు సత్కరించారు. చేనేత కార్మికులు మగ్గం బహూకరించారు. చంద్రబాబు రోడ్డు షోతో పాయకరావుపేట వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. బాబు ప్రసంగం ఆద్యంతం యువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ నినాదాలు చేస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలను పట్టుకొని మద్దతు తెలిపారు. -ఆంధ్రజ్యోతి, అనకాపల్లి



నా తొలి ఓటు చంద్రబాబుకే వేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు





గాజువాక సభకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు



చంద్రబాబునాయుడుకు రాజ్యాంగాన్ని బహూకరిస్తున్న అనిత, సీఎం రమేశ్



గాజువాక సభలో ప్రసంగిస్తున్న విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, పల్లా శ్రీనివాస్



జాలర్లు బహూకరించిన వలలతో చంద్రబాబునాయుడు



చంద్రబాబు ప్రసంగానికి చేతులు ఎత్తి మద్దతు తెలుపుతున్న యువకులు



పోలీసుల నిఘా నీడలో పాయకరావుపేట సభ



చంద్రబాబు సభలో సీబీఎం ఆర్మీ

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

అచ్యుతాపురం, ఏప్రిల్ 14: మండలంలోని తిమ్మరాజుపేటలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ ఐతంశెట్టి రాము (38)ఆదివారం మృతి చెందాడు. కొండకర్ల ఆవ వద్ద గల ఒక రిసార్ట్‌లో విద్యుత్ వైరింగ్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై పై అంతస్తు నుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాముకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాము (ఫైల్)

బంగారంతో పరారీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: నగలు తయారు చేసి ఇస్తానని బంగారంతో పరారైన గోల్డ్‌స్మిత్‌పై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గవరపాలెం కొణతాల చిన్నయ్యగారివీధికి చెందిన దాడి లింగేశ్వరరావు అనే వ్యక్తి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న గోల్డ్‌స్మిత్ బి. భాస్కర సత్యనారాయణకు వస్తువులు తయారు చేయమని బంగారం ఇచ్చాడు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఇచ్చిన 56 గ్రాముల బంగారానికి నాలుగు బంగారు గాజులు తయారు చేసి ఇచ్చాడన్నారు. మిగిలిన బంగారంతోపాటు మరో 46 గ్రాములు వస్తువుల తయారీకి ఇచ్చాడు. ఈయనతోపాటు బొడ్డేడ జ్యోతి, చల్లా కుమారి, ఆడారి లావణ్య, మరికొంతమంది మొత్తంగా వివిధ వస్తువుల తయారీకి 300 గ్రాములు బంగారం ఇచ్చారు. అయితే కొంతకాలం నుంచి భాస్కర సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్యను ప్రశ్నించగా.. తన భర్త ఎక్కడికి వెళ్లాడో తెలియదని, వచ్చిన వెంటనే బంగారం ఇస్తారని చెబుతున్నారు. ఇలా కాలయాపన జరగడంతో పరారై పోయి ఉంటాడని భావించి భాస్కర సత్యనారాయణపై పోలీసులకు లింగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అంబేడ్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శం

» ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

సబ్బవరం, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన డాక్టర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి భారతదేశం పండగగా అభివర్ణించారు. అనేక సామాజిక, ఆర్థిక అసమానతలను తట్టుకొని ఎదిగి, దేశానికి దిశా నిర్దేశం చూపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని వీసీ సూర్యప్రకాశరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ మొట్టమొదటి వీసీ వై. సత్యనారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ నందినీ సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, కో-కన్వీనర్ డాక్టర్ నిర్మలాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ డాక్టర్ సూర్యప్రకాశరావు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

ప్రజలకు న్యాయం చేసే నేత చంద్రబాబు

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

పాయకరావుపేట, ఏప్రిల్ 14: . రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేసే నాయకుడు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యమహల్ జంక్షన్‌లో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే సీఎంగా చంద్రబాబు మళ్లీ అధికార పగ్గాలు చేపట్టాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు ఏర్పడితే డబుల్ ఇంజిన్ పాలనతో పరిశ్రమలు వస్తాయన్నారు. నేను ఎంపీగా గెలిస్తే నరేంద్రమోదీ ప్రధాని అవుతారని, జగన్ పార్టీ ఎంపీలు గెలిస్తే ఎవరికి మద్దతు ఇస్తారో చెప్పాలన్నారు. గతంలో 22 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఉపయోగం లేని వైసీపీ ఎంపీలు రాష్ట్రానికి అవసరమా అన్నారు. ఈ ప్రాంతంలో 18 గ్రామాల్లో మత్స్యకారులున్నా, వారి సమస్యలు తీరలేదన్నారు. పాయకరావుపేటలో నిరుపయోగంగా ఉన్న అంబేడ్కర్ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల బెస్ట్ డ్రైవర్ చంద్రన్న : అనిత

రాష్ట్ర అభివృద్ధి కోసం కృషిచేస్తున్న నాయకుడు, రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల బెస్ట్ డ్రైవరు నారా చంద్రబాబునాయుడు అని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, 2014-19లో రూ.1500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ పాలన ఒక దద్దమ్మ పాలనగా అభివర్ణించారు.

మూడింజన్ల మహాకూటమి బుల్లెట్ ట్రైన్‌కు చంద్రబాబు డ్రైవర్‌ను చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

పాయకరావుపేట కూడా విశాఖపట్నంలా అభివృద్ధి చెందేందుకు వనరులు ఉండడం అదృష్టంగా భావించాలన్నారు. కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నప్పటికీ వారిని కూడా జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశాడనడానికి ఉదాహరణలు ఉన్నాయన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గానికి వచ్చిన చంద్రబాబునాయుడికు భారత రాజ్యాంగాన్ని ఆమె బహూకరించారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

» ఉదయం 6 గంటలకే నిండిన క్యూ లైన్లు

» సౌకర్యాలను పరిశీలించిన డీసీ సుజాత

» మొక్కులు చెల్లించుకున్న ప్రజలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున ఆరు గంటలకు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఆలయ ఆవరణలో భక్తుల సందడి తగ్గలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోళ్లు పట్టుకుని అమ్మవారికి మొక్కులు మొక్కారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లోని తోటల్లో భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతర అధికారిణి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, ఈవో బండారు ప్రసాద్ క్యూలో ఉన్న భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు చల్లటి తాగునీటిని అందించారు. అలాగే మజ్జిగను కూడా పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా భక్తులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అలాగే ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ముఖ్య ప్రదేశాల్లో బందోబస్తు నిర్వహించారు.



బాలాలయంలో క్యూలైన్‌లో భక్తులను పరిశీలిస్తున్న డీసీ సుజాత



అమ్మవారికి మొక్కులు మొక్కుతున్న భక్తురాలు

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

బడుగుల ఆరాధ్య దైవం అంబేడ్కర్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. మహిళలకు సమున్నతస్థానం కల్పించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అప్పలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతో బండారు భేటీ

» టీడీపీ అధినేతను కలిసిన గవిరెడ్డి రామానాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుతో ఆదివారం ఎయిర్‌పోర్టులో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి భేటీ అయ్యారు. ఎన్నికల సభలకు జిల్లాకు వచ్చిన చంద్రబాబు ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక వెళుతుండగా బస్సులో బండారు సత్యనారాయణమూర్తి, అతని కుమారుడు అప్పలనాయుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే జి.రామానాయుడుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. సీట్ల సర్దుబాటులో భాగంగా పెందుర్తి సీటు జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించడంతో కొద్దిరోజులుగా బండారు ఇంటికే పరిమితమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సూచనతో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య స్వయంగా బండారును ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చి చంద్రబాబుతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బండారును చంద్రబాబు బుజ్జగించారు. ఏ పరిస్థితుల్లో పెందుర్తి సీటు జనసేనకు కేటాయించామో వివరించారని తెలిసింది. అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అందుకు బండారు అంగీకరించకుండా బస్సు దిగి వెళ్లిపోయినట్టు సమాచారం.



బస్సులో బండారు, ఆయన కుమారుడితో మాట్లాడుతున్న టీడీపీ అధినేత

ఉక్కును కాపాడుకుంటాం

» నాలుగేళ్ల క్రితం అందరం కలిసి ఢిల్లీ వెళదామన్నా

» జగన్మోహన్‌రెడ్డి వైపు నుంచి కనీస స్పందన లేదు

» గాజువాక ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆదివారం రాత్రి పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ సుమారు 23 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని వాజపేయి సాయంతో కష్టాల్లో ఉన్న ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. నాలుగేళ్ల క్రితం ప్రైవేటీకరణ ప్రతిపాదన వచ్చినప్పుడు...సీఎం నాయకత్వంలో అందరం కలిసి ఢిల్లీ వెళదామని ప్రతిపాదించానని, కానీ జగన్మోహన్‌రెడ్డి నుంచి కనీస స్పందన లేదన్నారు. అప్పుడు స్పందించని జగన్‌కు ఇప్పుడు ఓటు అడిగే హక్కు ఉందా?...అని చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. గాజువాకతోపాటు జిల్లా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. గంగవరం పోర్టుతో ఉపాధి కోల్పోయిన దిబ్బపాలెం మత్స్యకారులకు యారాడ వద్ద జెట్టీ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. గాజువాక అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక్కడ టీడీపీకి పటిష్టమైన నాయకత్వం ఉందన్నారు. బీజేపీ, జనసేన కూడా కలవడంతో వచ్చే ఎన్నికల్లో తిరుగులేదన్నారు. మూడు పార్టీలు సమన్వయంతో పని చేసి మంచి మెజారిటీ సాధించాలన్నారు.

ఏపీ సీఎస్, డీజీపీలను మార్చాలి

అభ్యర్థులకు రక్షణ కల్పించాలి: అరకు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత



అరకులోయ, ఏప్రిల్ 14: సీఎం జగన్‌పై జరిగిన దాడిపై ఎన్నికల కమిషన్ స్పందించి సీఎస్, డీజీపీలను మార్చాలని అరకులోయ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎంకే రక్షణ కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రిపైనే దాడి జరిగితే తమలాంటి అభ్యర్థులకు రక్షణ ఏముంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటన దృష్ట్యా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, డీజీపీలను విధుల నుంచి తప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజాసామ్యానికి విఘాతం కలిగిస్తే సహించకూడదని, కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. ఏపీలో రౌడీ మూకలు, బెదిరింపురాయళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల సమయంలో సీఎంతో పాటు అన్ని పార్టీల అభ్యర్థులకు రక్షణ కల్పించాలని విన్నవించారు. తామంతా స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

ప్రచారానికి అనుమతుల్లో జాప్యం నివారించాలి

ఎన్నికల కమిషన్ నిబంధనలకు తగ్గట్టుగా ప్రచారం కోసం అనుమతులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సకాలంలో ఇవ్వడం లేదని, ఈసీ జోక్యం చేసుకుని అనుమతులు సత్వరం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత డిమాండ్ చేశారు. ఎన్ని ఆటోలకు దరఖాస్తు చేసుకుంటే అన్ని రూ.500 చలానాలు తీస్తేనే అనుమతులు ఇస్తున్నారని, ఎన్నికల నిబంధనల్లో లేని నిబంధనలను రంపచోడవరం అధికారులు అమలు చేస్తున్నారని గీత ఆరోపించారు.

వైభవంగా సీలేరు మారెమ్మ ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు, ఏప్రిల్ 14: మారెమ్మ అమ్మవారి 52వ వార్షిక మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తమిళ పూజారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆలయం ధ్వజ స్తంభం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి మాలా ధారణ భక్తుల జేజే మారి అనే నినాదాలతో ఆలయం మార్మోగింది. సీలేరుకు చెందిన దండుపాటి శ్రీను దంపతులు, ఆలయ కమిటీ నిర్వాహకుల చేతులు మీదుగా ఉత్సవాల ప్రారంభోత్సవ పతాకాన్ని భక్తిశ్రద్ధలతో ఎగురవేశారు. సీలేరు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి పతాకం నుంచి కింద పడే పువ్వులను మహిళలు చెంగులతో వడిసి పట్టుకుంటే అమ్మవారి కటాక్షం లభిస్తోందని ఈ ప్రాంత భక్తులు నమ్మకం వ్యక్తం చేశారు.

అలరించిన ఆధ్యాత్మిక సత్సాంగం



ఆధ్యాత్మిక గీతాలను ఆలపిస్తున్న గాయకులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 14: మండల కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగం కార్యక్రమం అందరినీ అలరించింది. రవిశంకర్ గురూజీని స్ఫూర్తిగా తీసుకొని విశాఖ నగరానికి చెందిన సంస్థ నిష్ణాతులు (గాయకులు) సత్సాంగంలో సుమధుర గీతాలను ఆలపించారు. గాయని పద్మజ స్వర మాధుర్యానికి భక్త ప్రాంగణం పరవశించి పోయింది. అరుణ, రమణి, శ్రీకరిల నుంచి జాలువారిన పలు ఆధ్యాత్మిక గీతాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. చిన్నా పెద్దా అంతా కలసి నృత్యం చేస్తూ ఆధ్యాత్మిక చింతనలో లీనమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ బృందాన్ని పూలమాలలతో సత్కరించారు. తబలా కళాకారుడు రాజేష్ మాష్టార్‌ను గాయనిపద్మజలకు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ ఎప్పటికి పూర్తయ్యేనో?

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టరుపై ఒత్తిడి చేయలేకపోతున్నారు. బిల్లుల కోసం కాంట్రాక్టరు ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నారు.

నిరుపయోగంగా యంత్రాలు



నిరుపయోగంగా ఉన్న యంత్రాలు

ఎకో పల్పింగ్ యూనిట్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో యంత్రాలు నిరుపయోగంగా పడి వున్నాయి. ఎకో పల్పింగ్ యూనిట్‌కి సంబంధించిన యంత్రాలను సుమారు రూ.20 లక్షల నిధులతో కొనుగోలు చేసినప్పటికి వాటిని అమర్చే పరిస్థితి లేక ఓ పక్కన నిరుపయోగంగా వున్నాయి. ప్రస్తుతం యంత్రాలు తుప్పుపడుతున్నాయి. ప్రధానంగా ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద పైకప్పు నిర్మాణం, యంత్రాలు అమర్చేందుకు విద్యుత్ సరఫరా ఉండాలి. ఎకో పల్పింగ్ యూనిట్‌కి విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి ఈపీడీసీఎల్ అధికారులకు సుమారు రూ.8 లక్షల నిధులు చెల్లించాలి. విద్యుత్ కనెక్షన్‌కి సంబంధించిన నిధులు సైతం ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో ఎకో పల్పింగ్ యూనిట్ వద్ద పనులు చేపట్టే అవకాశం లేకుండాపోయింది.

కాఫీ ఉత్పత్తిలో జీకే వీధి అగ్రగామి

జిల్లాలో గూడెంకొత్తవీధి మండలం కాఫీ ఉత్పత్తిలో అగ్ర స్థానంలో ఉన్నది. మండలంలో ఆదివాసీ రైతులు అత్యధికంగా 42 వేల ఎకరాల్లో కాఫీ సాగు చేపడుతున్నారు. సరైన సేద్య పద్ధతులు పాటించకపోవడం వల్ల ఆశించిన దిగుబడులు రాకపోయినప్పటికి ప్రతి ఏడాది 4,200 టన్నుల క్లీన్ కాఫీ ఉత్పత్తి చేస్తున్నారు. ఐటీడీఏ సహకారంతో మ్యాక్స్ కాఫీ పండ్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నది. కిలో పండ్లకు రూ.43 గరిష్ఠ తొలి ధరను అందజేస్తున్నది. దీంతో గిరిజన రైతులు కాఫీ పండ్లను మ్యాక్స్ ద్వారా మార్కెటింగ్ చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండల కేంద్రంలో ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి రాకపోవడం వల్ల మండలానికి చెందిన ఆదివాసీలు పండించిన కాఫీ పండ్లను చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌కి తరలించుకోవాల్సి వస్తున్నది. దీంతో రవాణా ఖర్చు పెరుగుతున్నది. రవాణా ఖర్చు పెరగడం వల్ల రైతులకు వచ్చే బోనస్ తగ్గే అవకాశమున్నది.

ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే..

గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆదివాసీలు కాఫీ తోటల నుంచి సేకరించిన పండ్లను వెనువెంటనే ఎకో పల్పింగ్ యూనిట్‌కి తరలించే అవకాశముంటుంది. చింతపల్లికి తరలించే రవాణా ఖర్చులు తగ్గుతాయి. రైతులు ప్రైవేటు వర్తకులను ఆశ్రయించకుండా సేకరించిన పండ్లను పూర్తి స్థాయిలో మ్యాక్స్ ద్వారా మార్కెటింగ్ చేసుకునే అవకాశం కలుగుతుంది. రైతులు చెర్రీగా విక్రయించుకోకుండా మెజారిటీ పండ్లను పార్చిమెంట్‌గా విక్రయించుకుని గరిష్ఠ ధర పొందే అవకాశం ఉంటుంది.

వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం



వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎకో పల్పింగ్ యూనిట్ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఎకో పల్పింగ్ యూనిట్ అందుబాటులోకి వస్తే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుంది. ఆదివాసీ రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయి. రైతులకు మేలు జరిగే ఈ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం దారుణం.

\- గడుతూరి నాగరాజు, లక్కవరం





పాడేరులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అప్పలనర్స తదితరులు... కొయ్యూరులోని గుజ్జుమానుపాకలులో నివాళి అర్పిస్తున్న ఎంపీపీ

వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు

- విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు





అరకు: సర్భగుడలో జోహార్లు అర్పిస్తున్న బాలదేవ్, నాయకులు... పెదబయలులో మహిళల జోహార్లు

పాడేరు రూరల్/కొయ్యూరు/చింతపల్లి/జి.మాడుగుల/గూడెంకొత్తవీధి/అరకులోయ/ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/పెదబయలు/హుకుంపేట, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం మన్యంలో ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల్లో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు రాజకీయ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాడేరు మండలంలోని సీఏహెచ్ స్కూల్ ప్రాంగణంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఉపాధ్యాయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.జాన్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పలాసి కృష్ణారావు, రేగం సూర్యనారాయణ, కె.రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాత బస్టాండ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బి.సింహాచలం, ఎల్.వెంకటరమణదొర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. పాడేరు మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.వెంకటరమణ, జి.శివకుమార్, బి.జ్యోతికిరణ్, రాజేష్, నీలకంఠం పాల్గొన్నారు. మినుములూరు కాఫీ కాలనీలో సీపీఎం మండల కార్యదర్శి ఎల్.సుందరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స పాల్గొన్నారు. కొయ్యూరు మండలంలో ఎంపీపీ బడుగు రమేష్ బాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నేతలు ఎస్.సూరిబాబు, ఎస్.సన్యాసిరావు, పాపారావు పాల్గొన్నారు. అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ ఆధ్వర్యంలో సర్భగుడ గ్రామంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామారావు, సర్భగుడ గిరిజన సంఘం నాయకులు మంగనాయుడు, నిరంజన్, కోటి, కార్తీక్, నైనా, లక్ష్మణ్, కల్యాణ్ పాల్గొన్నారు. జి.మాడుగుల మండలంలో టీడీపీ నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బొయితిలి పంచాయతీ మద్దిగరువులో సర్పంచ్ మాలన్న, మాజీ సర్పంచ్ కిడారి భీంబాబు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, కిముడు కల్యాణం, పిన్నయ్యదొర, బాలయ్యదొర, కొండబాబు, నూకరాజు, సుబ్బారావు రామారాజు, క్రిష్ణమూర్తినాయుడు, మురళి, సూరిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జి.మాడుగుల ఎంపీపీ ఎ.సీతమ్మ, సీఐ ఆర్.రమేష్, ఎస్ఐ కె.రవీంద్రతో పాటు సేవా సంఘం ప్రతినిధులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీలేరు పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఏపీ జెన్‌కో ఎస్ఈ ప్రశాంత్‌కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి జయప్రసాద్, ఈఈ ప్రభాకరరావు, జెన్‌కో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో టీడీపీ, వైసీపీ, యూటీఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, నాయకులు కమ్మిడి సుబ్బారావు, స్వామి, కృష్ణారావు, సింహాచలం, వినోద్‌కుమార్‌చ హరి, నిరీక్షణరావు, సింహాద్రి, యూటీఎఫ్ నాయకులు మహేశ్వరరావు, బాలక్రిష్ణ, మోహనరావు పాల్గొన్నారు. పెదబయలు మండలంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలు సంఘాల నాయకులు భీంసుందర్, వరప్రసాద్, సూరయ్య, వెంకటరమణ, సన్నిబాబు, అప్పారావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, గిరిజన సంక్షేమ శాఖ బాలుర పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, బాలాజీపేట గ్రామంలో గిరిజన సంఘం నాయకులు అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసపడాల్, గిరిజన సంఘం నాయకుడు సాగిన చిరంజీవి పడాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ పాల్గొన్నారు. హుకుంపేటలో అంబేడ్కర్ ఫొటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అధికారులు, నాయకులు బ్రహ్మాజీరావు, వినయ్ మోహన్ రమేష్, పూలేజాన్, ప్రసాద్, కొండబాబు ఉద్యోగులు పాల్గొన్నారు.

సరకులు ఇవ్వకుండా పౌష్టికాహారం పంపిణీ సాధ్యమా

- అంగన్‌వాడీ కేంద్రాలకు పప్పు, నూనె సరఫరా చేయడం లేదు
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

అరకులోయ, ఏప్రిల్ 14: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులు ఇవ్వకుండా పౌష్టికాహారం పంపిణీ చేయడం సాధ్యమేనా అని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావమ్మ ప్రశ్నించారు. గత ఏడాది నవంబరు నుంచి నూనె, కందిపప్పు సక్రమంగా సరఫరా జరగడం లేదని చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. నెలలు తరబడి పప్పు, నూనె సరఫరా చేయకపోవడంతో చిన్నారులకు ఆహారం తయారీకి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం అంతంతమాత్రంగానే ఉంటుందని, దీంతో ఆన్‌లైన్ పనులకు అంతరాయం ఏర్పడుతున్నదని చెప్పారు. ఆఫ్‌లైన్ విధానంలో కార్యకలాపాలు సకాలంలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో అంగన్‌వాడీలకు వేతనాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతో అందరికీ హక్కులు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దురియా నాగమ్మ, ప్రధాన కార్యదర్శి కె.బాగ్యలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, నాయకులు పెంటమ్మ, వెంకటలక్ష్మి, కొండమ్మ, చిన్నారి, నరసమ్మ, పోతురాజు పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకురావాలి

- గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధి యూవీ గిరి



రక్తదానం చేస్తున్న గిరిజన ఉద్యోగులు, చేయూత వారియర్స్ సభ్యులు

చింతపల్లి, ఏప్రిల్ 14: రక్తదానం చేసేందుకు గిరిజన యువత ముందుకురావాలని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యూవీ గిరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ మైదానంలో చేయూత వారియర్స్ ట్రస్ట్ రెడ్‌క్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 78 మంది ఉద్యోగులు, యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం మరో ప్రాణాన్ని కాపాడడమేనన్నారు. చేయూత వారియర్స్ ట్రస్టు సభ్యులు ఏడాదికి రెండు, మూడుసార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరించడం అభినందనీయమన్నారు. పది మంది యువకులు కలిసి చేయూత వారియర్స్ పేరిట వ్యక్తిగత నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వారియర్స్ ప్రతినిధులు దూనబోయిన రమణ, ఈరెల్లి రాజేశ్, ఇందుగ శేఖర్, మోదగిరి, బిలాస్కర్, జగన్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు డాక్టర్ బీవీవీ ప్రసాద్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు, ఎల్‌టీ అనిల్, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు బొడు గంగరాజు, కేవీ రమణ, దేపూరి శశి కుమార్, లోచలి రామకృష్ణ, కామేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

పాడేరు రూరల్, ఏప్రిల్ 14: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. మన్యంలోని వివిధ గ్రామాల భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వందలాది మంది అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. మైదాన ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని, పూజలు చేపట్టి ఆలయ ప్రాంగణంలో పండగలను నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో ఆలయ ప్రసాద కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, కె.పోతురాజు, ఎస్.కొండలరావు, వి.రాజబాబు పాల్గొన్నారు. అలాగే పాడేరు ఘాట్ రోడ్డులోని మోదాపల్లి జంక్షన్ వద్ద గల అమ్మవారి పాదాల దర్శనానికి వందలాది మంది భక్తులు వచ్చారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి పంచలోహాల కలశం వితరణ



రాజరాజేశ్వరి అమ్మవారికి కలశం బహూకరిస్తున్న భక్తుడు

పాడేరులోని పురాతన శైవక్షేత్రం ఉమానీలకంఠేశ్వరుని ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో నిర్మిస్తున్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయానికి పాడేరుకు చెందిన మెకానిక్ సుక్కి రాము, బేబీ దంపతులు ఆదివారం రూ.20 వేలు విలువైన పంచలోహాల కలశం బహూకరించారని ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తెలిపారు. అమ్మవారికి ఆలయానికి పంచలోహాల కలశం బహూకరించిన రాము బేబి దంపతులను ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల రామం, పంతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సప్పా కొండలరావు, వెశిది బాబూరావు, రాజబాబు, వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషిచేయాలి: జీసీసీ మాజీ చైర్మన్

హుకుంపేట, ఏప్రిల్ 14: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని జీసీసీ మాజీ చైర్మన్ శెట్టి లక్ష్మణుడు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కొంత మంది టీడీపీ టికెట్ ఇవ్వలేదని ఆవేదనతో స్వతంత్రగా పోటీకి సిద్ధమయ్యారన్నారు. అయిఏ పార్టీ కేడర్ వాస్తవాలను గ్రహించాలని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు జగన్ బూటకపు పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

పార్టీ విజయానికి ఐక్యంగా పనిచేద్దాం

చింతపల్లి: పాడేరు నియోజకవర్గంలో టీడీపీ విజయానికి ఐక్యంగా పనిచేద్దామని పార్టీ అరకు పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం రాజకీయ పరిణామాలు, సర్వేల ఆధారంగా రమేశ్‌నాయడుకు టికెట్ కేటాయించిందని, ఈ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయం కేడర్ లక్ష్యమన్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడదాం..

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 14: అధిష్టాం నిర్ణయానికి కార్యకర్తలు, నాయకులు కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కోనా ఎల్లారావు సూచించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం కనిపిస్తున్నదన్నారు. అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ పార్టీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు, నాయకులు పనిచేయాలన్నారు. వర్గ విభేదాలతో పార్టీకి నష్టం చేయకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు త్రీమూర్తులు, ధర్మన్నపడాల్ పాల్గొన్నారు.

విద్య, ఉపాధిపై విద్యార్థులకు అవగాహన

డుంబ్రిగుడ, ఏప్రిల్ 14: విద్య, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతిగృహ బాలుర, బాలికల విద్యార్థులకు రాత్రి పూట నిద్రించడానికి 62 పరుపులను వితరణ చేశారు. నిరుపేద గిరిజన విద్యార్థులకు సంస్థ తరుపున వైజాగ్ కింగ్స్ రౌండ్ టేబుల్ 213 స్వచ్ఛంద సంస్థ, వైజాగ్ ఆల్ఫా రౌండ్ టేబుల్ 305 సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పరుపులను అందజేశారు. గిరిజన విద్యార్థుల శ్రేయస్సుకు సంస్థలు తోడ్పాటునందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల హెచ్‌డబ్ల్యూవో రవికుమార్, అధ్యాపకులు చంద్రశేఖర్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

పాడేరు రూరల్, ఏప్రిల్ 14: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విపత్తుల స్పందన అగ్నిమాపక అధికారి (డీడీఆర్ఎఫ్) లక్ష్మణస్వామి సూచించారు. పాడేరు అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం వారోత్సవాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను పాటించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లను అధిగమించాలన్నారు. గృహాల్లో విద్యుత్ లైన్‌లలో చిన్న సమస్య ఉన్నా వెంటనే మరమ్మతులు చేయించుకోవాలన్నారు. అంతకుముందు ఈ ఏడాది అగ్నిప్రమాదంలో అమరులైన సిబ్బంది బేచా యాదవ్, జేఎస్.రంజిత్, సతీష్ టేరాన్‌లను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.పెంటయ్యనాయుడు, అగ్నిమాపక సిబ్బంది ఎల్.బాలకృష్ణ, ఎల్.చంద్రశేఖర్, వెంకటేష్, శివాజీరాజు, పరమేశ్వరరావు, హేమంత్, రవిరాజు, కొండలరావు, రాము, గిరీష్, శివయ్య, త్రినాథ్, రాంబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కార్లలో తనిఖీ చేస్తున్న పోలీసులు సిబ్బంది

జి.మాడుగుల, ఏప్రిల్ 14: మావోయిస్టుల బంద్ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగించే అన్ని వాహనాలకు ఆదివారం నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు మావోయిస్టు పార్టీ బంద్ ప్రకటించిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

బాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

మంగవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద చంద్రబాబునాయుడుకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, తోట నగేశ్, స్థానిక నేతలు చంద్రబాబుకు పూలబొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి సూర్యామహల్ జంక్షన్ ప్రజాగళం సభా ప్రాంగణం వరకు మహిళలు, వృద్ధులు, యువకులు దారిపొడవునా బాబుపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమలపాకు రైతులు చంద్రబాబును తమలపాకులతో తయారు చేసిన గజమాలతో సత్కరించారు. చేనేత కార్మికులు బాబును కలిసి మగ్గం బహూకరించారు. హెలీప్యాడ్ నుంచి సాగిన ర్యాలీలో బాబు వెంట వేలాదిమంది కార్యకర్తలు పాల్గొని జై తెలుగుదేశం, సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తప్పెటగుళ్ల, మేళతాళాలతో చంద్రబాబును ప్రజాగళం వేదిక వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సుమారు అర్ధగంట సేపు సాగిన బాబు రోడ్డుషోతో పేట వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. వేలాదిగా హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. అశేషంగా హాజరైన నాయకులు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు పాయకరావుపేటను జన సంద్రంగా పోలుస్తూ ఈ జనాన్ని చూస్తే తాడేపల్లి పిల్లి గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ఖాయమని వ్యాఖ్యానించడంతో జనం ఒక్కసారిగా కేరింతలు, అరుపులతో హోరెత్తించారు. నెల రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించి కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసుకోడానికి సిద్ధమా అని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు సిద్ధమేనంటూ యువకులు, మహిళలు చేతులెత్తి జవాబిచ్చారు. ప్రజాగళం సభ విజయవంతం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది.